కౌటాల మండలంలో 5 బడులు మూత

- టీచర్లు లేక వారం రోజులుగా తెరుచుకోని బడులు
- ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఈ దుస్థితి



ఉపాధ్యాయులు లేక మూసిఉన్న కేబీ కాలనీ మొగడ్ధగడ్ గిరిజన పాఠశాల

కౌటాల, ఆగస్టు 27 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని పలు గిరిజన పాఠశాలలు ఉపాధ్యాయులు లేక వారం రోజులుగా తెరుచుకోవడంలేదు. కేబీ కాలనీ మొగడ్ధగడ్, శివలింగపూర్, కనికి, జనగాం ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. గురుడుపేట గిరిజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మెడికల్ లీవ్‌లో ఉండటంతో 5 గిరిజన పాఠశాలలు మూతపడ్డాయి. రోజూ విద్యార్థులు పాఠశాలకు వచ్చి.. ఉపాధ్యాయు లు లేక తిరిగి వెళ్తున్నారు. ఎస్సీఆర్పీ మడావి పోచానిని వివరణ కోరగా, ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో పాఠశాలలు నడవడం లేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఖమ్మం, సిరిసిల్ల టీచర్లు

దేశవ్యాప్తంగా 50 మంది ఎంపిక

ప్రభాకర్‌రెడ్డి

సంపత్

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఖమ్మం, సిరిసిల్లకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్టు కేంద్ర విద్యాశాఖ మంగళవారం వెల్లడించింది. దేశవ్యాప్తంగా 50 మంది ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను విడుదల చేసింది. సెప్టెంబర్ 5న వీరందరికీ న్యూఢిల్లీలో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుంది. తెలంగాణ నుంచి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం జడ్పీహెచ్ఎస్‌లోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా దమ్మన్నపేట జడ్పీహెచ్ఎస్‌లోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు తాండూరి సంపత్‌కుమార్ జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

- శిశువిహార్‌లో కలెక్టర్ కూతురు

మిషన్ శక్తి పాలన పథకంలో భాగంగా కుమ్రం భీం ఆసిఫాబాద్‌లోని మార్కండేయ కాలనీ అంగన్‌వాడీలోని శిశువిహార్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తన కూతురు ఫరాను ఇటీవల చేర్పించి ఆదర్శంగా నిలివారు. మంగళవారం ఆయన శిశు విహార్ కేంద్రానికి సందర్శించారు. – ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్

భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదని..

వారసత్వంగా వచ్చిన భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయకుండా ధికారులు తప్పించుకుంటున్నారని మనస్తాపానికి గురైన భగవాన్ అనే రైతు తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకున్నది. – రామారెడ్డి

గుజరాత్‌ను ముంచెత్తిన వానలు

ఏడుగురి మృతి

అహ్మదాబాద్: గుజరాత్‌ను భారీ వర్షాలు ముంచెత్తాయి. సౌరాష్ట్ర ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా ఏడుగురు ప్రా ణాలు కోల్పోయారు. అధికారులు దాదాపు 15,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సుమారు 300 మందిని సహాయక బృందాలు కాపాడాయి. దేవభూమి ద్వారక, ఆనంద్, వడోదర, ఖేడ, మోర్బి, రాజ్‌కోట్ జిల్లాల్లో సైన్యం, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి. వర్షాల ధాటికి సురేందర్‌నగర్ జిల్లాలో ఓ బ్రిడ్జి కూలిపోయింది.

తెలంగాణ కన్నీళ్లు తుడవడానికే రీ డిజైనింగ్

- 37 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేందుకే కాళేశ్వరం నిర్మాణం
- రఘు, వెదిరే శ్రీరామ్ సీడబ్ల్యూసీ అంశాలను వక్రీకరించారు
- కమిషన్‌కు అఫిడవిట్ దాఖలు చేశా: రాష్ట్ర జల వనరుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కన్నీళ్లు తుడిచేందుకు, రాష్ట్ర సాధన ఉద్యమ ఆంక్షాలు, లక్ష్యాలను నెరవేర్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినట్టు రాష్ట్ర జల వనరుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్ చెప్పారు. 16 లక్షల ఎకరాలకు బదులుగా 37 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేందుకు ప్రాజెక్టు రీ డిజైనింగ్ చేసినట్టు తెలిపారు. విద్యుత్తుశాఖకు చెందిన రఘు, కేంద్ర జల్‌శక్తిశాఖ సలహాదారు వెదిరే శ్రీరామ్ సీడబ్ల్యూసీ లేఖలను వక్రీకరించారని ఆక్షేపించారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో కాళేశ్వరం విచారణ కమిషన్ ఎదుట మంగళవారం ఆయన హాజరై తన అఫిడవిట్ దాఖలు చేశారు. అనంతరం వీ ప్రకాశ్ మీడియాతో మాట్లాడుతూ.. తాను కమిషన్ ఎదుట అఫిడవిట్ దాఖలు చేశానని చెప్పారు. తుమ్మడిహట్టి నిర్మాణం సాధ్యం కాదని, ఇందుకు సంబంధించిన కారణాలతో కూడిన వివరాలను ఇచ్చినట్టు తెలిపారు. గోదావరి వాటర్ స్టోరేజీగా ఉండాలని, తుమ్మడిహట్టి వద్ద నిర్మించాల్సిన బరాజ్‌ను మేడిగడ్డకు మార్చామని స్పష్టంచేశారు. 190 కిలోమీటర్లు గోదావరి సజీవంగా ఉండాలనే ఉద్దేశంతో డిజైన్ చేసినట్టు చెప్పారు. అలాగే తుమ్మడిహట్టిపై కాగ్ ఆక్షేపాలను కూడా కమిషన్‌కు వివరించినట్టు పేర్కొన్నారు. తాను సమర్పించిన అఫిడవిట్ పరిశీలన తర్వాత మళ్లీ పిలుస్తామని కమిషన్ చెప్పినట్టు వీ ప్రకాశ్ వెల్లడించారు.

కొనసాగుతున్న 'కాళేశ్వరం' విచారణ

సమాధానమిచ్చిన ఐదుగురు ఇంజినీర్లు

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై కమిషన్ విచారణ కొనసాగుతున్నది. హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో మంగళవారం నిర్వహించిన ఓపెన్‌కోర్టుకు ఐదుగురు ఇంజినీర్లు హాజరయ్యారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. మేడిగడ్డ లోకేషన్ మారలేదని కమిషన్ ముందు ఇంజినీర్లు స్పష్టం చేశారు. మూడు బ్యారేజీలకు సంబంధించి డిజైన్లలో ఎలాంటి సమస్య లేదని నిబంధనల ప్రకారమే డిజైన్లు ఉన్నాయని చెప్పారు. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగుబాటుకు కారణం రాఫ్ట్ కింద పలు సమస్యలేనని వివరించారు. సిఖెండ్ ఫైల్స్, అలాట్మెంట్ డివియేషన్ వల్ల సమస్య వచ్చిందని ఇంజినీర్ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు.

రామప్ప శిల్పకళ కు గవర్నర్ ఫిదా

- కాకతీయుల కట్టడంపై ప్రశంసలు
- ఆకట్టుకున్న యాదగిరిగుట్ట నిర్మాణాలు
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కితాబు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పూజలు

ములుగు, ఆగస్టు 27 (నమస్తేతెలంగాణ)/యాదగిరిగుట్ట/ములుగురూరల్: కాకతీయుల కళా వైభవమైన యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ శిల్ప కళకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఫిదా అయ్యారు. జీవకళతో చెక్కిన శిల్పాలను చూసి ముగ్ధులయ్యారు. మంగళవారం ములుగు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన రోడ్డు మార్గాన ఉదయం 11 గంటలకు ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకోగా మంత్రి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయన ములుగులోని కలెక్టరేట్ సమావేశ మందిరానికి చేరుకున్నారు. కొమ్ముకోయ నృత్యాలతో గవర్నర్‌కు స్వాగతం పలికారు. జిష్ణుదేవ్‌వర్మ జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించగా జిల్లాలో జరుగుతున్న ప్రగతిని గవర్నర్‌కు కలెక్టర్‌తో పాటు మంత్రి సీతక్క పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం జిల్లాకు చెందిన రచయితలు, కవులు, కళాకారులు, జాతీయ అంతర్జాతీయ క్రీడా అవార్డు గ్రహీతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో చర్చ గోష్ఠి నిర్వహిస్తూ మధ్యాహ్న భోజనం చేశారు. అక్కడి నుంచి రామప్ప దేవాలయానికి చేరుకొని రుద్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ గైడ్‌ల ద్వారా కాకతీయుల నాటి శిల్ప కళల గురించి తెలుసుకొని గవర్నర్ మంత్రముగ్ధులయ్యారు. రామప్ప దేవాలయ ప్రత్యేకత సంతరించుకున్న నీటిపై తేలే ఇటుకల గురించి ప్రొఫెసర్ పాండురంగారావు గవర్నవర్‌కు ప్రత్యక్షంగా వివరించారు. ఆ తర్వాత భూపాలపల్లి జిల్లా గణపురం లోని కోటగుళ్లను సందర్శించిన అనంతరం గవర్నర్ గోవిందరావుపేట మండలం బుస్సాపురంలోని లక్నవరం సరస్సును సందర్శించి రాత్రి 2వ ఐలాండ్‌లోని కాటేజీలో గవర్నర్ బస చేశా రు. కాగా.. గవర్నర్ ములుగు జిల్లా పర్యటన ఆంక్షల నడుమ కొనసాగింది. జర్నలిస్టులను అనుమతించలేదు. వరంగల్ పర్యటనకు ముం దు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశంతో కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గవర్నర్‌కు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ హనుమంత్ కే జండగే, అనువంశిక ధర్మకర్త బీ నరసింహ మూర్తి, ఈవో భాస్కర్‌రావు ఘన స్వాగ తం పలికారు. అనంతరం గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ప్రధానార్చక బృందం చతుర్వేద ఆశీర్వచనం చేయగా.. దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు గవర్నర్‌ను వీఐపీ శాలువాతో సన్మానించారు.

ఏఆర్ కానిస్టేబుల్‌కు విషపురుగు కాటు

గవర్నర్ పర్యటనలో భాగంగా వెంకటాపూర్ మండలం పాలంపేట అటవీ ప్రాం తంలో బందోబస్తు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ గుండ్ల ప్రశాంత్‌ను విషపురుగు కాటేసింది. అస్వస్థతకు గురైన ప్రశాంత్‌ను పోలీసులు ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

నిజాంసాగర్, ఆగస్టు 27: పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లిన రైతు విద్యుత్తు షాక్ తగిలి మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం వెల్గనూర్‌లో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన మ్యాదరి సాయిరాములు (36) సోమవారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. మోటర్ నడవకపోవడంతో కరెంట్ సరఫరా ఉందో లేదో పరిశీలిస్తుండగా షాక్ తగిలి మృతి చెందాడు. సాయిరాములు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లగా, విగతజీవిగా ఉన్నాడు. పోలీసులు వివరాలు సేకరించారు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌలురైతు ఆత్మహత్య

- అప్పుల బాధ తాళ లేక మనస్తాపం
- తీర్చే మార్గం కనిపించక బలవన్మరణం
- రామాయంపేటలో విషాదం

వెల్ముల ప్రవీణ్ (ఫైల్)

రామాయంపేట, ఆగస్టు 27: అప్పుల బాధలు భరించలేక.. వాటిని తీర్చే మార్గం కనిపించక ఓ కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెల్ముల ప్రవీణ్ (33) సోమవారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. ప్రవీణ్ కొంతకాలంగా అప్పులతో బాధపడుతున్నాడని, వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి జ్యోతి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి లేక ఆటో డ్రైవర్ ..

- అప్పులు పేరుకపోవడంతో మనస్తాపం
- డీజిల్ పోసుకుని బలవన్మరణం
- భద్రాద్రి జిల్లాలో ఘటన

ఇమ్మాన్యుయేల్ (ఫైల్)

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 27 : ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకా రం.. కొత్తగూడెంలోని హనుమాన్ బస్తీకి చెందిన కొప్పుల ఇమ్మాన్యుయేల్ (54) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆటో కోసం అప్పు చేయడం, ఆ తరువా త ఉపాధి కరువై ఆటో నడవకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. అలాగే కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న ఇమ్మాన్యుయేల్ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం కూడా ఇంట్లో గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన ఇమ్మాన్యుయేల్ మంగళవారం ఇంట్లో ఉన్న డీజిల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో నేత కార్మికుడి బలవన్మరణం

ఉపాధిలేక బతుకు భారమై.. • సిరిసిల్లలో వైపని కార్మికుడి ఆత్మహత్య

సతీశ్ (ఫైల్)

సిరిసిల్ల తెలంగాణ చౌక్, ఆగస్టు 27 : సిరిసిల్లలో మరో నేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొన్ని నెలలుగా ఉపాధి లేక బతుకు భారమై నేత (వైపని) కార్మికుడు ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బీవై నగర్‌కు చెందిన జక్కని సతీశ్ (22) తల్లిదండ్రులు 20 ఏండ్ల కిందటే చనిపోయారు. దీంతో తన అక్క సువర్ణ వద్ద ఉంటున్నాడు. ఆమె భర్త సైతం పదేండ్ల కిందటే ఆత్మహత్య చేసుకోగా, బీడీలు చేస్తూ తమ్ముడు సతీశ్‌ను పెంచింది. సతీశ్ వైపని పనిచేస్తూ అక్కకు ఆర్థికంగా సహాయపడేవాడు. కొన్ని నెలలుగా ఎలాంటి ఉపాధి లేకపోవడంతో ఇల్లు గడవడం లేదు. ఈ క్రమంలో రూ.1.5 లక్షల వరకు అప్పు చేశాడు. ఉపాధి లేక, అప్పు తీర్చే మార్గం కానరాక తీవ్ర మనస్తాపం చెందిన సతీశ్ మంగళవారం ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

- యూరియా కోసం రైతుల క్యూ

ములుగు జిల్లా కేంద్రంలోని పాత ఎఫ్‌సీఐ గోదాంల వద్ద మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో అందించే యూరియా కోసం రైతులు ఎండలో క్యూ కట్టారు. గవర్నర్ పర్యటన సందర్భంగా అన్ని దుకాణాలను మూసివేయడంతో జిరాక్స్‌ల కోసం రైతులు నానా తంటాలు పడ్డారు. పోలీసులు వన్‌వే పెట్టి ఎక్కడికక్కడ ద్విచక్రవాహనాలను నిలుపడంతో కొందరు రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. –ములుగురూరల్

- సిమెంట్ ఫ్యాక్టరీకి మా భూములివ్వం

ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి వద్ద ఏర్పాటు చేయనున్న రేణుక సిమెంట్ ఫ్యాక్టరీకి తమ భూములు ఇచ్చే ప్రసక్తే లేదని ఆదిలాబాద్ రూరల్, జైనథ్ మండలాలకు చెందిన 8 గ్రామాల రైతులు తేల్చి చెప్పారు. భూములు ఇవ్వాలని రెవెన్యూ అధికారులు వేధించడాన్ని నిరసిస్తూ మంగళవారం వారు ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

- పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గంలోని మాజీ సర్పంచ్‌లు మంగళవారం భైంసా పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. – భైంసా

- ప్రాణాలైనా ఇస్తాం.. ఫార్మాకు భూములియ్యం

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు రైతుల నుంచి అడుగడుగునా నిరసన వ్యక్తమవుతున్నది. మంగళవారం దుద్యాల తహసీల్దార్ కార్యాలయంలో పోలేపల్లికి చెందిన మహిళా రైతు తూర్పు రాజమ్మ పురుగుల మందు డబ్బాను బయటకు తీసి చావనైనా చస్తాను గానీ భూమి మాత్రం ఇచ్చేది లేదని చెప్పారు. అప్రమత్తమైన తోటి రైతులు ఆమె చేతిలోని పురుగుల మందు డబ్బాను గుంజుకున్నారు. – బొంరాస్‌పేట

రుణం చెల్లించినా కానీ రుణమాఫీ

ఆదిలాబాద్ జిల్లాలో వెలుగుచూస్తున్న నిజాలు

రెబ్బెన పీఏసీఎస్ కార్యాలయం ముందు అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు (ఫైల్)

మంచిర్యాల, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సహకార సంఘాల్లో తప్పుడు లెక్కలు, అక్రమాల వల్ల అనేక మంది రైతులు రుణమాఫీకి అర్హత కోల్పోతున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం (పీఏపీఎస్)లో ముల్కల్ల గ్రామానికి చెందిన రైతు బాపుకు రూ.1,10,515 మాఫీ అయినట్టు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. వాస్తవానికి ఆయనకు ఉన్న అప్పు రూ.9,727 మాత్రమే.. కానీ లక్షకుపైగా మాఫీ అయినట్టు మెసేజ్ రావడంతో అవాక్కయ్యాడు. పీఏసీఎస్‌కు వెళ్లి అడిగితే పొంతన లేని సమాధానం చెప్పారు. దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. డాటా ఎంట్రీ సమయంలో పొరపాటు జరిగిందని, బాపుతో పాటు మరికొందరి రైతులకు ఇలా అయ్యిందంటూ అధికారులు తేల్చారు. రెబ్బెన మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లోనూ ఈ తరహా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. బాధిత రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో విషయం కలెక్టర్ దాకా వెళ్లింది. ప్రస్తుతం విచారణ నడుస్తున్నది. అయితే పీఏపీఎస్‌లలో అనుకోకుండా పొరపాట్లు జరిగాయా? లేక రైతుల పేరున కొందరు రుణాలు తీసుకొని అక్రమాలకు పాల్పడ్డారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల చనిపోయిన రైతుల పేరిట కూడా రుణాలు ఉండటం ఈ అనుమానాలకు బలం చేకూర్చుతున్నది.

ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు యెల్ల రజినీకాంత్. నిర్మల్ జిల్లా కుంటాల మండలం లింబా(కే) తన కుటుంబసభ్యులు కుంటాల పీఏసీఎస్‌లో తీసుకున్న రుణాన్ని 2018లో వడ్డీతో కలిపి రూ.50,450 చెల్లించాడు. తర్వాత గ్రామీణ బ్యాంక్‌లో రూ.2 లక్షలు రుణం తీసుకున్నాడు. ఈ రుణం మాఫీ కాలేదు. ఆరా తీయగా కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో రూ.67,274 లోన్ ఉన్నదని వ్యవసాయ అధికారులు చెప్పారు. దీంతో 2018లో చెల్లించిన రసీదు తీసుకొని సొసైటీకి వెళ్లాడు. తనకు రుణమాఫీ అయితదా? కాదా? అన్న దిగాలులో ఉన్నాడు. -యెల్ల రజినీకాంత్

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నంబాలకు చెందిన సంజీవ్ కుమార్ జైస్వాల్. ఈయన భార్య సంగీత పేరుపై ఉన్న 3.10 ఎకరాల వ్యవసాయ భూమికి రెబ్బెన పీఏసీఎస్‌లో రుణం తీసుకున్నారు. 2021లో రుణం చెల్లించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో రూ.లక్ష, తన పేరుపై రూ.60 వేల రుణం తీసుకున్నాడు. ఈ రుణం మూడో విడుతలో మాఫీ అవుతుందనుకున్నాడు. తీసుకున్న రుణం కట్టినప్పటికీ రూ.1.25 లక్షలు తీసుకున్నట్లే చూపిస్తున్నది. దీంతో రుణమాఫీకి అర్హత కోల్పోయాడు. -సంజీవ్ కుమార్ జైస్వాల్

నేటి నుంచి గ్రామాలవారీగా రైతుల సర్వే: తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీలో జరిగిన లోపాల సవరణకు నేటి(బుధ వారం) నుంచి పూర్తిస్థాయిలో గ్రామా ల వారీగా సర్వే నిర్వహించనున్నట్టు వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రైతు రుణమాఫీపై మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంక్‌ల నుంచి వచ్చిన వివరాల్లో తప్పులను మండల వ్యవసాయ అధికారులతో వేగవంతంగా సవరించనున్నట్టు చెప్పారు. ఆగస్టు 15నాటికి 22,37,848 లక్షల మంది రైతులకు రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేసినట్టు ఆ శాఖ కార్యదర్శి రఘునందనరావు మంత్రికి వివరించారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ కాని రైతుల కోసం యాప్ రూపొందించినట్టు చెప్పారు. సమీక్షలో రాష్ట్ర వ్యవసాయ సంచాలకుడు గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ఉక్కిరి బిక్కిరి

మొదటిపేజీ తరువాయి...

బయటకు వస్తున్న మంత్రి తుమ్మల కారును ప్రధాన గేటు వద్ద రైతులు అడ్డగించారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కారు దిగిన తుమ్మల వారితో మాట్లాడారు. అయినప్పటికీ వారు నినాదాలు ఆపకపోవడంతో తీవ్ర అసహనానికి గురై రైతులపై చెయ్యెత్తారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ రైతు రుణమాఫీ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో 41,78,892 మంది రైతులు 40 బ్యాంకుల ద్వారా 5,782 బ్రాంచిల నుంచి రుణాలు తీసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం రూ.31 వేల కోట్ల నిధులను కేటాయించిందని చెప్పారు. 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించి, అమలు చేస్తుందని తెలిపారు. ఇప్పటివరకు రూ.12 వేల కోట్లు రైతుల ఖాతాల నుంచి తిరిగి రుణాలుగా పొందారని చెప్పారు. కుటుంబ నిర్ధారణ జరగకనే రుణమాఫీ ఆలస్యమవుతున్నదని, ప్రభుత్వపరంగా ఎలాంటి జాప్యం లేదని స్పష్టం చేశారు. మంగళవారం నుంచి వ్యవసాయ అధికారులు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తారని చెప్పారు. కుటుంబసభ్యుల ఫొటోలను ప్రత్యేకయాప్‌లో అప్‌లోడ్ చేస్తారని తద్వారా రుణమాఫీ మొత్తం రైతు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు.

సగం మంది రైతులకే రుణమాఫీ

అంతకుముందు ధర్నాలో సీపీఐ, సీపీఎం నాయకులు, రైతుసంఘాల నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో సగం మంది రైతులకే రుణమాఫీ జరిగిందని, ప్రభుత్వ లెక్కలు అసంబద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 30 శాతం మందికి కూడా రుణమాఫీ జరగలేదని పేర్కొన్నారు. ఆగస్టు 30వ తేదీలోపు 2లక్షల రుణమాఫీ జరగాలని లేదంటే రైతులతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. ధర్నా అనంతరం రైతుల డిమాండ్లు, సమస్యల పరిష్కారం కోరుతూ రెండు పార్టీలు నేతలు, రైతు సంఘాల నేతలు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

- కలెక్టరేట్ల ఎదుట రైతుల నిరసన

రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం కలెక్టరేట్ల ఎదుట రైతులు ధర్నా చేశారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కొందరికే రుణమాఫీ డబ్బులు వచ్చి మిగతా రైతులకు రాకపోవడంపై రైతు సంఘాల నేతలు మండిపడ్డారు. –నమస్తే తెలంగాణ నెట్‌వర్క్